*"కన్నకూతుర్ని వెతుక్కుని చూసుకుని శవాన్ని ముద్దాడి ఆ ఇసుక దిబ్బమీద చేతి వేళ్ళతో గొయ్యితీసి ఏడుస్తూ పాతిపెట్టి పిచ్చిగా అరిచింది." ఎవరు? ఆ పిచ్చితల్లి ఈ దేశంలో ఓ ఆడది!*

నేల చెమ్మగా వున్నది. గదంతా మాసిపోయిన బట్టలవాసన. అప్పుడెప్పుడో రాయగడ రోడ్డుమీద ఎదురుగా గోడమీద ఎవరో పిచ్చి పిచ్చి బొమ్మలేశారు. ఆ పక్క కలగాపులగంగా ఏవో తేదీలు, రాతలు 2-10-63. 15-8-47 గాంధీ, స్వాతంత్ర్యం, దాని పక్క అస్పష్టంగా ఏదో బొమ్మ, దానికింద జండా గుడ్డతో వురేసుకున్న పాతికేళ్ళ కుర్రాడు.... ఇలాంటివే.... దగ్గరగా చూసేనేగాని కనబడవు. దాని కెదురుగావున్న గోడమీద చంప చచ్చిపోయిందా? మరి కళ్యాణి చచ్చిపోలేదు, చంపేరు, చంపేరు. మహాపాత్రో చచ్చిపొయేడు. అక్కడ వికృతంగా బొగ్గు ముక్కల్తో గీసిన పిచ్చి గీతలు. అస్పష్టంగా రాసిన రాతలు.

గది గోడలు ఏడుస్తున్నట్టుగా వున్నాయి.

గదికి ఎడంపక్కగా ఒక మూల గొంతుక్కూచున్నాడు మహాపాత్రో. అతను కూర్చున్నచోటుకి కొంచెం కుడిపక్క పైన చేటంత ఇనుప చువ్వల కిటికీ. కిటికీలోంచి ఎండ గదిగోడ సగాన్ని తాకి అలా అలా పైకి జరుగుతోంది. ముందు తీక్షణంగాపడ్డ ఎండ రాన్రానూ రంగు పోగొట్టుకుని సన్నగా, సన సన్నగా పాలిపోయి వుండుండి గోడమీద బల్లిలా పాకుతోంది. ఆ మూల కూర్చుని అలా నీడ కదిలిన దిక్కువైపే సాగుతున్న చూపులు గోడ చివరంటా సాగి ఆగిపోయాయి. ఎండలేదు. మిగిలింది ఎండపొడ మాత్రమే. కళ్ళు పీకినట్టుగా అన్పించాయి. రెండు అరచేతులతోను రెండు కళ్ళూ కాసేపు మూసుకున్నాడు.

మసక చీకటి

కాటుక పొడి రాలుస్తున్నట్లుగా వుంది.

కళ్ళిప్పి బైటకు చూశాడు.

తలుపు ఇనుప చువ్వల్లోంచి కనబడుతున్న దృశ్యం గోడమీద అంటించిన పెద్ద పోస్టర్‌లా వుంది.

దూరంగా పెద్ద అరుగు. ఆ రాతి చపటా మధ్య దృఢంగా, బలంగా పెరిగినచుర్రిమాను. వేలాడుతున్న వూడలు కిందకు వంగి గాలికి మెల్లగా కదుల్తున్న ఆకులు.

ఆ చపటామీద కాలు ఆనించి నిలబడి పక్కనున్న ఖైదీతో మాట్లాడుతున్న యింకొక ఖైదీ చేతిలో బీడియో, చుట్టో తెలీటంలేదు. కుంపట్లో రేగిన నిప్పు కణంలా మెరుస్తోంది. దానివెనక కొంచెం దూరంలో చిన్న కంచె. కంచె వెనక ఎవరో తిరుగుతున్న ఖైదీలు.... తెల్లగా టోపీలు.

మళ్ళీ దృష్టి మరల్చాడు మహాపాత్రో. తల పైకెత్తి గోడమీదకు చూశాడు. ఎందుకో కిటికీ వేపు చూశాడు. గబుక్కున లేచి కిటికీదగ్గరకు వెళ్ళాడు. మడమలు పైకెత్తి. మెడ బాగా చాచి బైటకు చూశాడు.

పెద్ద రాతి గోడ. ఆ గోడ పైన ముళ్ళ తీగలు. కత్తిరించిన నీలి కాగితమ్ముక్కలా ఆకాశం కనబడ్డాది.

మరికొంత సేపటికి చీకటి దుఃఖంలా కమ్మేసింది. అప్పటి వరకూ అలాగే నిలబడి కిటికీ లోంచి ఆకాశంవేపు చూస్తూనే వున్నాడు.

ఏవో రెండు పక్షులు ఎగురుతూ కనిపించాయి. ఆ పక్షుల వెనకే చూపులు నిలిపాడు ఎంత సేపు.

మరో క్షణానికి పక్షులు కనబడలేదు.

వెనక్కి తిరిగేడు

అప్పుడు చూశాడు బైటగది పక్కగా నిలబడి తనవేపే చూస్తూ నిలుచున్నాడు పోలీసు.

"ఏం చూస్తున్నావ్ .... తప్పించుకుని వెళిపోదామనా...." చేతికర్రతో యినుప చువ్వలమీద టక, టకా, టక్... టక్.... టకా.... టక్ ....టక్ ....వరసగా కొడ్తూ వికారంగా నవ్వుతూ అడిగాడు పోలీసు ఒరియాలో.

సమాధానం చెప్పలేదు మహాపాత్రో.

"లైట్లు వెయ్యరా .... చీకటిపడింది.." అడిగాడు మహాపాత్రో పోలీసుని.

మహాపాత్రో వేపు ఒకసారి చూసి, అలవాటుగా ఖాండ్రించి వుమ్మి, చీదుకుని వెళ్ళిపోయేడు. మసకచీకట్లో వాడి వికారాలేవీ స్పష్టంగా కనబడలేదు మహాపాత్రోకి. ఆ వెళ్ళేటప్పుడు బూట్లశబ్దం .... వెళ్తున్నప్పుడు వాడు రాతిగోడమీద లాఠీతో చేసే చప్పుడు కరుగ్గా వుంది.

తలుపు దగ్గరకొచ్చి బైటకు చూశాడు.

ఎక్కణ్ణుంచో ఎవరో ఏడుస్తున్న శబ్దం వినబడింది. రాన్రానూ అది ఎక్కువౌతోంది. ఆ ఏడుపు తగ్గలేదు. ఆ గొంతు మగగొంతో. ఆడగొంతో తెలీటంలేదు. కొంత సేపయాక ఏడుపుగొంతు కీచుగా, బొంగురుగా మారిపోయింది.

కళ్ళు జిగేల్‌మన్నాయి మహాపాత్రోకి.

చీకటిని చీల్చుకుని కనబడిన కాస్త మేరా పరుచుకున్న వెల్తుర్ని అలా కన్నకూతుర్ని చూసుకున్నట్టుగా చూశాడు.

మహాపాత్రో చేతి వేళ్ళు గట్టిగా బుర్రలోకి దోపి జుత్తు పీక్కున్నాడు. ఇనుప చువ్వలకేసి బుర్రని గట్టిగా అదిమేడు. గడ్డాన్ని పీక్కున్నాడు. గట్టిగా చువ్వల్ని పట్టుకుని లాగేడు. గదికి బైట వేసిన తాళం చప్పుడు. తలుపు విసురుగా కదిలిన చప్పుడు వినబడింది-

"లం.... కొడుకులు ...." గట్టిగా, శక్తినంతా కూడదీసుకుని, కేకతేసినట్టుగా




దాట్ల నారాయణమూర్తి రాజు

ఒక్కసారి తిట్టాడు అతని తిట్లు అతనికే వికృతంగా వుంది. అసహ్యంగా వుంది.

ఎందుకో ఒక్కసారి అతని కళ్ళంట నీళ్ళు వచ్చాయి.

అతనికి ఒక్కసారి చంప జ్ఞాపకాని కొచ్చింది.

చంప.

చంప.

సంవత్సరం నిండిన కళ్యాణి తనవేపు చేతులు చాచినట్టుగా అనిపించింది. రెండు పిడికిళ్ళూ మూసి ఇనుపచువ్వలమీద, అడ్డు గర్రమీద గట్టిగా కొట్టాడు. పెద్ద శబ్దం అయింది.

మరికొంత సేపటికి—

టక్.... టకా.... టక్.... టకా.... టక్.... టకా....

లాఠీ శబ్దం.

"ఏరా.... ఏంవిటా గోల.... తగలా గా...." లాఠిలాగే కరుకు గొంతు. కళ్ళు చిట్లించి చూస్తూ చప్పుడుచేస్తూ కిళ్ళీ నవుల్తూ వెళ్ళిపోయాడు పోలీసు.

అతనికోసారి రఘువీర్ పండా. పరశురామ్ మిశ్రా. జగన్నాథ్. విశ్వజిత్ శతపథి, వాళ్ళ మనుషులు. ఛత్రపూర్, ఋషికుల్ నది ఇసక దిబ్బలు, ఆ ఇసక దిబ్బల మీద తను వూపిరి బిగపట్టి పరుగెత్తిన పరుగు తన వెనక తనతోపాటు పరుగెత్త లేక.... బోర్లాపడిపోయిన చంప.... చంప చేతిలోని కళ్యాణి.... ఆ వెనక.

వాళ్ళు.... ఏడుగురు.

ఏడుగురు.

అంతా వొక్కసారి కళ్ళముందు కనిపించింది.

మహాపాత్రోకి ఆ వేళ వుదయం జ్ఞాపకాని కొచ్చింది. ఆ వేళ వుదయం తనింకా లేవలేదు చంప టీ తీసుకొచ్చి తట్టి లేపించి ఇచ్చిపాడు.

కళ్ళతోనే పలకరించింది. టీ కప్పుని అతని చేతికిచ్చి వారగా కూర్చుంది.

టీ తాగుతూ చిలిపిగా ఆమె కేసి చూశాడు.

"అయ్యగారు ఆశయాల్లోనే కాదు.... ఆచరణలోనూ గొప్పవారే...."

"ఏంవిటట...."

"ఈ వార్త చూడండి...." అని ఆ వేళ్టి దినపత్రిక. అతని చేతికిచ్చింది.

మహాపాత్రో చూశాడు

"బొక్కుకట్టి ఫ్రెంట్ పేజీలో వేశారే" ఆశ్చర్యంగా పెళ్ళాంవేపు చూశాడు

"వాళ్ళకి ఇప్పటికైనా బుద్ధొస్తుంది లెండి...." అనేసి టీ కప్పు తీసుకుని లేచి లోన గదిలోకి వెళ్ళిపోయింది చంప.

చాలాసేపు అలా పేపరు చూస్తూ వుండిపోయాడు.

దూరంగా ఋషికుల్ నదిఒడ్డున పడవలు సర్దుతున్న జాలరివాళ్ళ కేకలు వినిపించటంలేదు. కానీ వాళ్ళ వురుకులు. పరుగులు కనబడుతున్నాయి.

వూరిమధ్యనున్న దేవాలయంలో మోగుతున్న గుడిగంటలు లయగా వినిపిస్తున్నాయి.

"వేగిరం స్నానం చెయ్యండి గుడికెళ్దాం ..." మాటాడకండా లేచాడు మహాపాత్రో.

తయారయేసరికి అరగంట పట్టింది.

ఇంతట్లో చంప తయారైపోయింది. ఇత్తడి పూలసజ్జలో సెమ్మె. వత్తులు. పువ్వులు. అగరొత్తులు, కుంకుమ. పసుపు వుంచింది.

తల దువ్వుకుంటూ ఆమెవేపు చూశాడు.

సన్నగా. పొడవుగా వుంటుంది చంప. చంపకి చేరడేసి కళ్ళున్నాయి. ఆ కళ్ళవేపు చూస్తున్నపుడల్లా ఎందుకో అవినాష్ మిశ్రా జ్ఞాపకానికొస్తాడు. మిశ్రా చంప తొలి భర్త.

ఎందుకో మహాపాత్రోకి తను మొట్ట మొదట ఆ వూరొచ్చిన కొత్తలో తనని ఆదరించిన మధుచక్రవర్తి గుర్తుకొచ్చాడు

మధు చక్రవర్తి.

తనకో మంచి స్నేహితుడు. తనకి

కాలేజీ చదువులో ఆదుకుని ఈ మాత్రం దారి చూపించిన మధు.

ఆ వేళ మధు బజార్లో కలిశాడు.

గట్టిగా కౌగలించుకున్నాడు. ఇద్దరూ నిరంజన్ దాదా కొట్లోకి నడిచేరు. పాత సంగతులన్నీ ముందుకొచ్చేయి.

మొట్టమొదటినుంచి తను ఏకాకి. ఎవరికీ ఏమీకాడు. తండ్రి ఎలాగుంటాడో తెలీదు. తల్లి పేదరికంతోనే చచ్చిపోయింది. జ్వరంతో, మామూలు జ్వరంతోనే చనిపోయింది.

ఆఖరు చూపులకూడా తను వెళ్ళలేకపోయాడు. అమ్మ చనిపోయిన మూడ్రోజులకనుకుంటాను ఆ విషయం తెల్సింది. ఆదరాబాదరాగా బరంపురం నుంచి బైల్దేరేడు.

ఏంవిటి?

అంతా ఐపోయింది.

రెండు గదులుగా ఏర్పాటు చేసుకున్న చిన్నపాక. ఆఖరు సారిగా కొడుకు కోసం కలవరించి వూపిరి వదిలేసిన అమ్మ పడుకున్న నులక మంచం. దానికి పేగుల్లా వేలాడుతున్న నులకతాళ్ళు. ఆ మూల బుడ్డి దీపం.... సత్తుగ్లాసులు.... సిల్వరు బిందె. అదే తమ ఆస్తి!

తనని ఎలా పెంచింది అమ్మ. తన కోసంవే బతికింది. కన్నీళ్ళు. కష్టాలు, బాధలు, మండుటెండలో రాళ్ళ తట్టని నెత్తిన పెట్టుకుని తీసుకుని ఆ వచ్చిన కూలి డబ్బుతో తనని చదివించింది.

అలాంటి అమ్మ.

మందులేక, చూసే దిక్కులేక, పక్కన కొడుకులేక, ఏడ్వడానికూడా కన్నీళ్ళు రాక.... చచ్చిపోయింది. ఎవరో దూరపు బంధువులు దయతలచి శవాన్ని దహనం చేశార్ట.

"సారీ....వూరుకో.... రోజులన్నీ మనవికావులే....వూరుకో.. ఈ వూరెప్పుడొచ్చావ్.... నేనిక్కడే వుంటున్నానని తెల్సుకదా.... రాలేదేం...." అడిగేడు మధుచక్రవర్తి.

"ఇవాళే వచ్చాను. నువ్విక్కడే వున్నావని నేననుకోలేదు రిపోర్టర్‌గా వచ్చాను" తను రిపోర్టర్ ఇంటర్వ్యూకి వెళ్ళడం. సెలక్టు కావడం ఆ వివరాలన్నీ చెప్పాడు చక్రవర్తితో.

"ముందు ఇంటికెళ్దాం పద...."

ఇంటికి తీసికెళ్ళాడు.

కర్రగేటు తీసి లోనికి నడిచారు.

అటూ, ఇటూ అరటి చెట్లు, ఒకమూల జామిచెట్లు, ఏంవో పువ్వుల మొక్కలు. అవి దాటాక ఎడం పక్కన చిన్న గొడ్ల పాక. ఆ పాకలో రెండు గేదెలు. ఓ మూడు ఆవులు. వాటి పెయ్యలు, వాటి పేడ. ఆ పక్క గడ్డివాము.

అది దాటితే ద్వారబంధం. దానికి కొంచెంమేర పసుపు, కుంకంబొట్లు.

"చంపా...." పిలిచాడు.

కటకటాలు దాటాకవున్న వరండామీద-కుర్ర కుర్చీలమీద కూర్చున్నారిద్దరూను.

"నువ్వు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నావని వెంకట్ చెప్పేడు.... మరి నువ్వు...."

"అదా.... సెలవులో వున్నాను.... ఈ మధ్య...." ఏదో చెప్పబోయాడు మధుచక్రవర్తి.

ఇంతట్లో సన్నగా పట్టీల చప్పుడు.

తలెత్తి చూశాడు తను

తలుపు వెనక నీలం చీర కనబడింది

"వచ్చిన వాళ్ళు పరాయివారేం కాదు. మన పాత్రోయే...."

గది బైటకొచ్చి నిలబడింది చంప.

అప్పుడు చూశాడు ఆ అమ్మాయిని.

సన్నంగా పొడవుగా లేత అశోక మొక్కలాగా వున్నది. పైటచెంగుని తల మీంచి భుజం చుట్టూ కప్పుకుని నిలబడి నమస్కారం చేసింది. ఆ తర్వాత భోజనాల దగ్గర వడ్డించేటప్పుడు స్పష్టంగా చూశాడు ఆ అమ్మాయిని.

తెల్లగా, అమాయకంగా వుంది ముఖం. వత్తుగా జుత్తు అంతంత కళ్ళు. చక్కగా వుంది.

భోజనాలయాక మధు. పాత్రో మధ్య గదిలో మంచమ్మీద కూర్చున్నారు. చంప వక్కపొడి డబ్బా తీసుకొచ్చి బల్లమీద పెట్టి వంట గదిలోకి వెళ్ళింది.

"పాత్రో దీన్ని చూస్తే కడుపు తరుక్కుపోతుంది....నాకు.... నిండా ఇరవై ఏళ్ళు లేవు.... భర్త పోయాడు...."

తను నమ్మలేకపోయాడు.

నిజంగా!

చంప భర్త పోయాడా? ఎలాగ. ఎలాగ అదే అడిగాడు మహాపాత్రో.

"ఆయన చాలా మంచివాడు. ఆయనకున్న డిగ్రీకి ఎక్కడో దగ్గర హాయిగా లెక్చరర్ వుద్యోగంచేసుకుంటూ హాయిగా వుండొచ్చు.... కానీ.... ఆయనలా వుండలేకపోయాడు.... నువ్వు వినేవుంటావ్.. ఆయనపేరు.... కమల్‌సాహు...."

కమల్‌సాహు....

కమల్‌సాహు....

చాలాసార్లు ఆయనగురించి పేపర్లో చూసేవాడు.

ఒకసారి పార్వతీపురంలో.... అవును.. ఒకసారి ఆయన్ని చూశాడు.

అకస్మాత్తుగా అతనికిజ్ఞాపకంవచ్చింది. అవును పార్వతీపురంలో ఆవేళ తనూ వెళ్ళాడు ఆ మీటింగుకి.

వేలాది జనం.

అమరవీరుల సంస్మరణ సభ అది.

వక్తల్లో ఒకడు కమల్‌సాహు. అప్పటికే ఆయనకు మంచి పేరుంది. నిజంగా, ఆయన ఆడే ప్రతీమాట, పాడే ప్రతిపాట ఎంతో వుత్తేజకరంగా వుంటాయి.

ఆయన ముప్పై నిమిషాలపైగా ఉపన్యసించాడు. పాటలు పాడేడు.

ప్రజలు మంచుపడుతున్నా లెక్కచెయ్యలేదు

మధ్య మధ్యన "కమల్‌సాహు-జిందాబాద్....జిందాబాద్."

చివర్న ఆయన పాడిన పాటలు గొప్పగా వున్నాయి. ఆయన ఏ సత్యాన్నైతే నమ్మి, జీవితాన్ని ఆ ఉద్యమానికి అంకితం చేశాడో, హృదయంలోంచి దూసుకునివచ్చి, గొంతులో ఆకృతి యేర్ప



రచుఃని బైట కొస్తున్న ప్రజా పోరాట గీతాలు. చీకటి బానిసత్వంలోంచి రేపటి వెలుగుకి వేసే ఎర్రెర్రని బాటలు....ఆ పాటలు.

"ఊగరా! ఊగరా! ఊగరా!!!
ఉరికొయ్యనందుకుని ఊగరా!
ఉరికొయ్య నంటుకుని ఊగరా!
ఉయ్యాల లాగా బాగా ఊగరా!!

ఆ పాటలకు ప్రజలు హారతులిచ్చేరు. అదే సమయంలో పోలీసులు ఆయన్ని అరెస్ట్ చేశారు.

ప్రజలు నినాదాలు చేశారు. వెంటబడ్డారు మీటింగంతా ధ్వంసమైపోయింది. పోలీసుల లాఠీలు విలయతాండవం చేశాయి ప్రజల రక్తం రుద్రతాండవం చేసింది. కదిలిన జీపుకి అడ్డంగా నిలబడారు ప్రజలు.

పోలీసులు బాష్పగోళాలు విసిరారు. హెచ్చరిక లేకుండానే గాల్లో కాల్పులు జరిపారు. అంత రభస అయాక బలవంతాన ఆయన్ని తీసుకునిపోయారు.

ఆ వేళ అక్కడ, ఆ గొడవ అవుతున్నప్పుడు అక్కడే ఆ పక్కనున్న కిళ్ళీబడ్డీ దగ్గర సిగరెట్ వెలిగించుకుంటూ జీపులో తీసికెళ్ళిపోతున్న ఆయన్ని చూశాడు

సన్నగా, పొడవుగా, ఎర్రగా వుంటాడు. కళ్ళద్దాలు, చిన్న గడ్డం. చావో, బతుకో తేల్చుకోడానికి సిద్ధంగా వున్నట్టున్న చూపులు

"అవును.... ఆయన్ని చూశాను...." ఆ విషయం చెప్పాడు మహాపాత్రో.

"అది జరిగినప్పుడు ఆ మీటింగులో నేనూ. చంపా వున్నాం అదే ఆఖరుసారిగా.... ఆఖరుసారిగా ఆయన్ని చూడ్డం. ఆ తర్వాత ...."

కాసేపు ఆగేడు మధు.

"ఆ తర్వాత .... ఎదురు కాల్పులు జరిపిన విప్లవవాదుల మృతి" అని పత్రికా వార్తను చూసి ఆశ్చర్యపోయాన్నేను ఆ తర్వాత తెలిసింది ఆయన్ని. మరికొంత మంది ఉద్యమకారుల్ని శ్రీకాకుళం అడవుల్లో నిర్దాక్షిణ్యంగా, రాక్షసంగా హింసించి చంపినట్టుగా తెలిసింది..."

తను ఏదో అనబోయాడు. తనమాటలు ఇంకా బైటకు రాలేదు.

లోనించి వినబడిన ఏడుపు.

ఆ ఏడుపు చంపది గబుక్కున లేచి మధు లోనకెళ్లాడు.

* * *

ఆ తర్వాత ఒక రోజు భువనేశ్వర్ నుంచి వస్తున్నపుడు రైల్లో అడిగేడు మధు.

"మా [illegible]ద - నీ అభిప్రాయం [illegible]

త్వరలో వస్తున్న ప్రచురణలు
అలనాటి చరిత్రలు
ఈనాటి వేటి నవలలు
శ్రీ ప్రసాద్ రచనలు

| | |
|---|---|
| సామ్రాట్ శ్రీ రంగరాయ | 10-00 |
| షాజహాన్ | 13-00 |
| విజయనగర పతనం-1 | 13-00 |
| విజయనగర పతనం-2 | 12-00 |
| లకుమాదేవి [రచన ఎల్లాదేవి] (ఆంధ్రభూమి సీరియల్) | 15-00 |

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్ విజయవాడ2

"బాలజ్యోతి" చదివి ఆనందించండి!

"నొప్పి, బెణుకు, సలుపుల
నివారణకు
లేదు సాటి మరేదీ
జండూ బామ్




భారతదేశపు అత్యంత శీఘ్ర బాధా నివారిణి జండూ బామ్
3BROTHERS/ZB/10581Tel

WANTED
Central Government ఆఫీసులలో పని చేయుటకు 7000 Clerks కావలెను. Best Coaching Given for Staff Selection commission Examinations అర్హత: S.S.C పూర్తి వివరములతో Application ఫారమునకు రు. 4/- M. O. చేసి పొందవచ్చును.
I.T.E, Society, MADRAS-26

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు...
★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు
★ స్కూలు యూనిఫారంలు ... వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ రోడ్డు,
గవర్నరుపేట ...... విజయవాడ-2.

చక్కని ఇంగ్లీష్ మాట్లాడటం, వ్రాయటం ఎలా ?
"డి. బోస్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్"
అనే పుస్తకం చదివి చక్కని సరళమైన ఇంగ్లీషు మాట్లాడటం వ్రాయటం నేర్చుకొనండి చక్కని సన్నివేశముల ద్వారా సంభాషణ, పదజాలం, ఇంగ్లీషులో మీరు చేసే తప్పులు సవరణ ఇడియమ్స్ & ఫ్రేజెస్, లోకోక్తులు, మరి ఎన్నో విషయాలు "డి బోస్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్"లో వ్రాయబడినవి. విద్యార్థులు, తల్లిదండ్రులు, గృహిణులు, ఉద్యోగస్తులు, అక్షర జ్ఞానమున్న ప్రతివారు చదువ వలసిన పుస్తకం "డి బోస్ ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సు".
డి. బోస్ & బ్రదర్స్
పబ్లిషర్స్,
ఆర్య సమాజ్ మందిర్ ఎదుట,
కాచిగూడ, హైదరాబాద్-27.

చెప్పాడు.

"దాని బతుకులో కన్నీళ్ళు తుడవాలని, నేనో నిశ్చయానికొచ్చాను పాత్రో .... దాన్నికూడా అడిగేను ....నీ కేంవీ అభ్యంతరం లేకపోతే...." ఆ విషయం చెప్పాడు మధు.

తనే అడుగుదామనుకుంటున్నాడు. చాలా ఆనందంతో ఒప్పుకున్నాడు మహాపాత్రో.

* * *

"ఏంవిటి యిందాకటినుంచీ ఏంవిటా ఆలోచన .... గుడికెళ్ళొద్దా ...." చంప మాటలు వినబడ్డాయి. తన కళ్ళల్లో కళ్ళు పెట్టి చిలిపిగా చూస్తోంది చంప.

"ఏంవీలేదు.. ఏదో జ్ఞాపకం వచ్చింది అంతే" మహాపాత్రో లేచాడు.

గది బైట తాళం వేసి రోడ్డుమీద కొచ్చారు. అక్కణ్ణించి గుడికి ఓ రెండు ఫర్లాంగుల దూరం వుంటుంది. మధ్యన చిన్న కర్ర వంతెన దాటాలి. కర్ర వంతెన దాటాక కొంత దూరం పోతే నిరంజన్ దాదా టీ కొట్టు. ఆ వూళ్ళో మహాపాత్రోకి స్నేహితుడు, బంధువు, ఆత్మీయుడూ అన్నీ నిరంజన్ దాదాయే.

వాళ్ళిద్దర్నీ చూసి నవ్వి పలకరించి కళ్యాణిని చేతిలోకి తీసుకుని ముద్దాడి 'టీ' ఇవ్వబోయాడు.

"గుడి నుంచి వచ్చేటప్పుడు తీసుకుంటాం" చెప్పింది చంప.

గుడి నుంచి వస్తున్నప్పుడు ఇద్దరూ గుడి ప్రాంగణం దాటి కొబ్బరి చెట్టు క్రింద రాతి చపటామీద కూర్చుని ప్రసాదం తిని కబుర్లు చెప్పుకుని మెల్లగా నడుస్తూ వస్తున్నారు.

"ఏయ్ పాత్రో ...." ఆ పిలుపు వినబడినవేపు బుర్రతిప్పి చూశాడు పాత్రో.

నలుగురు మనుషులు. బలంగా వున్నారు. నలుగుర్లో ఇద్దరు పంచెలు కట్టుకున్నారు. మరిద్దరు లుంగీలు వేసుకున్నారు. వాళ్ళ కళ్ళల్లో ఏ భావమూ లేదు కానీ మాటలు మాత్రం మర్యాదగా లేవు.

"నిన్ను పండా తీసుకురమ్మన్నారు.."

పండా !

గుండె గుభేలుమంది. పండా. రఘువీర్ పండా. ఆ చుట్టు పక్కల పేరుమోసిన మోతుబరి. ఆ వూళ్ళో సగం కొబ్బరి తోటలుఆయనివే. పైగా వెయ్యెకరాల పైగా భూమి. పెద్ద మేడా .... రెండు మిల్లులు ....ఇలాటివెన్నో వున్నాయి. దానికితోడు రాజకీయపు పలుకుబడికూడా వుంది. దానిక్కారణం ఆ మధ్య ఓ మినిస్టరు వచ్చినపుడు వాళ్ళ యింట్లో జరిగిన విందు. జరిగిన హంగామా అవ్వన్నీ విన్నాడు తను

"నా భార్యను యింటిదగ్గర దిగబెట్టి వస్తాను ...." అన్నాడు పాత్రో.

"ఇప్పుడే .... తీసుకురమ్మన్నారు .... ఆయన మళ్ళీ భువనేశ్వర్ వెళ్ళిపోవాలి." రెండోవాడు అన్నాడు.

"నువ్వెళ్ళు .... వెళ్ళగలవా.. లేకపోతే దాదా కొట్లోకూర్చో.... నేనొచ్చేస్తాను.... అలాగేనా ...."

చంప ఏం మాట్లాడలేదు. తలతిప్పి 'వూఁ' కొట్టింది. ఒకసారి భార్యవేపుచూసి వాళ్ళవెనక వెళ్ళాడు మహాపాత్రో.

ఊరుకి కొంచెం దూరంగా పొలాల మధ్యన వుంది రఘువీర్‌పండా ఇల్లు. ఇల్లంటే అది ఇల్లు కాదు. పెద్ద కోటలాంటి భవనం. ఇంటిచుట్టూ అశోకంచెట్లు బానిస సైనికుల్లా వున్నాయి. అదేదో పెద్ద రాక్షస పక్షి రెక్కల్లాగా నల్లగా తలుపు. ఇంటి ముందు పచ్చికమేస్తూ ఆవులు ఓ అరడజనున్నాయి. గేటుదాటి లోనకెళ్తున్నప్పుడు స్తంభాలవేపు చూశాడు. ధనమదంతో ఉబ్బిపోయినట్టుగా వున్నాయి.ఆ స్తంభాల్లో ఓ స్తంభానికి బాగా బలిసి, అంతెత్తు పెరిగిన అదే జాతో తెలీని కుక్క క్రూరంగా అరుస్తూ గుర్రంలా వుంది. అలా అరుస్తున్నపుడు దాని పళ్ళ వేపు చూస్తుంటే ఎక్కడలేని భయం పుట్టుకొచ్చింది పాత్రోకి.

మెట్లెక్కాక వాళ్ళు నలుగురు బైట ఆగిపోయారు.

"లోనికెళ్ళు ...."

లోని కడుగేశాడు. దగ్గరగా వేసున్న తలుపు రెక్క తోసి లోనికి చూశాడు. ఎదురుగా పెద్ద ఫొటో. అందులో నిలువెత్తు మనిషి విశ్రాంతి తీసుకుంటున్నట్టుగా పులి మీద కాలు వేసి, వూతగా ఓ వేట తుపాకీ పట్టుకుని నిల్చున్నాడు.

ఆ పక్కన ఓ ఫేను నిలబడి అటూ ఇటూ చూస్తున్నటుగా వుంది. దాని ముందు తెల్లగా మెరుస్తూ ఓ మంచం.... అది మంచం కాదు., హంస తూలికా తల్పం.. అంటారే.... అలాంటిది.... అలాంటిది కావొచ్చు.. ఎందుకంటే దాన్నెప్పుడూ మహాపాత్రో చూడలేదు.

దానిమీద కూర్చుని వున్నాడాయన భారీ శరీరం. పచ్చగా దబ్బపండు ఛాయలో శరీరం. ఒకటోరకం గ్లాస్కో పంచె కట్టుకొని వున్నాడు ఇంకా పైకమీజు వేసుకోలేదు. వేసుకోడానికి సిద్ధంగా వున్నట్టున్నాడాయన.

చూడగానే ఆ విశాలమైన గుండెమీద ఎర్రగా మెరుస్తూ పగడపు బంగారపు

లాకెట్. వుంగరాల జుత్తు. వత్తుగా నల్లగా మీసాలు చూసేవాడికి ఆయన వయస్సు వెంటనే అంచనా కట్టడం కుదరదు

"మీరు నన్ను పిలిపించేర్ట" అడిగేడు పాత్రో.

అంతే.

ఆ తర్వాత అక్కడ ఓ అరగంట నిలబడే వున్నాడు మహాపాత్రో. నిలబడి ఆయన చెప్పింది వినడం తప్పించి ఏం మాట్లాడడానికి చోటు ఇవ్వలేదు. మాట్లాడలేకపోయాడు కూడా.

"ఇక నువ్వు వెళ్ళొచ్చు.."అని అన్నాడాయన.

మరి అక్కడ ఒక్క సెకెండయినా నిలబడలేదు పాత్రో. గబుక్కున పెద్ద పెద్ద అంగలు వేసుకుని బైటకొచ్చాడు.

ఆ భవనానికి కొంచెం దూరం వచ్చాక చూసుకున్నాడు, వళ్ళంతా చెమట్లు పట్టేశాయి కళ్ళజోడు తీసి. జేబురుమాలుతో నుదుట మీద. ముఖమ్మీద చెమటని తుడుచుకొని గబగబా....గబగబా.... పచ్చికలు దాటి.. ఇసక మేట దాటి .... కొబ్బరితోటదాటి.... నేల బావి దాటి.... రోడ్డు మీద కొచ్చాడు.

నిరంజన్ దాదా కొట్టుకొచ్చి కూర్చున్నాడు.

"పని కుర్రాణ్ణిచ్చి ఇప్పుడే అమ్మాయిని ఇంటికి దిగబెట్టించేశాను ...." అన్నాడు దాదా.

కాసేపు కూర్చున్నాక.

"ఏవిటి బాబూ....పండాగాడు....కవురెట్టాడు.... అమ్మాయి చెప్పింది" టీ చేసియిస్తూ అడిగేడు దాదా. టీ తాగి సిగరెట్ వెలిగించుకుని జరిగిందంతా చెప్పేడు.

"ఆళ్ళు రాక్షసులు బాబూ....ఆళ్ళకి యెదురేగి ఈ చుట్టుపక్కల యెవరేటి సెయ్యలేరు... ఎందుకు చెప్పు....తప్పుకు తిరగడవే మంచిది..." సలహా యిచ్చేడు నిరంజన్ దాదా.

"అది నా వృత్తి ధర్మం దాదా..." వెనక్కి వచ్చేస్తూ అన్నాడుమహాపాత్రో.

ఇంటికి వెళ్ళగానే గాభరాగా అడిగింది చంప

"ఏం గాభరావడకు.... ఏదో వార్త రాయమని చెప్పడానికి.... మరేం లేదు .... అంతే...."

"అంతేనా...." గుచ్చి గుచ్చి అడిగింది చంప. మరేం చెప్పలేదు పాత్రో.

ఆ రాత్రి చాలాసేపు నిద్రపట్టలేదు పాత్రోకి.

ఉదయం రఘువీర పండా ఆడిన మాటలు వరసగా. వరసగా గుర్తుకొస్తున్నాయి.

"మా గురించి నీ పేపర్లో ఏవద్రా రాయమన్నాడు...."

"............"

"ఇక్కడ మేం అన్యాయాలు చేస్తున్నావా. నువ్వు చూశావా. పోనీ నువ్వు చూసేవే అనుకో. గప్‌చుప్‌గా నోరు మూసుకుని వుండాలి తెల్సిందా.... నీకో పేపరుందని, నువ్వేది పంపిస్తే అది వాళ్ళేస్తారని ఇష్టమొచ్చినట్టుగా రాసి ఇస్తే నీకేదో పేరొస్తుందని అనుకుంటున్నట్టున్నావు.... కానీ.... ఒరే నువ్వేదో నిజాయితీ అనుకుంటున్నట్టుగా వున్నావు. అది నీకు కూడెట్టదు తెల్సా. ఇంకా ఎదగాల్సినోడివి పెద్దోళ్ళతో తగువెట్టుకోకు. వుద్యోగంగా సేస్తున్నావు కాబట్టి వుద్యోగంగానే సెయ్యి. అర్థమయ్యిందా...."

"........ ........"

"నువ్విలాటి వెధవరాతలు రాసినందుకు నిన్నీ క్షణాన్నే చిత్రహింసలు పెట్టించగల్ను... నువ్వనేవాణ్ణి లేకండా చెయ్యగల్ను.... అర్థమయిందా .... కానీ."

అక్కడ తనెందుకు ఏవీ మాట్లాడలేకపోయాడు. చేతగానితనమా? పిరికితనమా .... ఎందువల్ల.. ఇలాంటి వాళ్ళు వుంటూనే వుంటారు. కానీ. తను వృత్తినే వాళ్ళేదో భయపెట్టారని ఝడిసిపోయి తన కర్తవ్యాన్ని విస్మరిస్తాడా?

ఆ రోజు రాత్రి చాలా సేపు నిద్రపట్టలేదు మహాపాత్రోకి. డ్రాయర్ సొరుగు తీసి ఏవో కాగితాల కటలు తీశాడు. మరొకసారి చదివేడు. అవన్నీ తను సిద్ధంగా వుంచుకున్న వాళ్ళ అక్రమాల వ్యాసాల పరంపర. అందులో వున్నది రఘువీర్ పండా. వాడి హంగుదార్ల అక్రమాలు. చేసున్న అన్యాయాలు అన్నీ వివరంగా కష్టపడి తను సంపాదించిన సాక్ష్యాలు అన్నీ అద్దంలా వున్నాయి.

అవి పంపించాలా? వద్దా? పంపిస్తే. పంపకపోతే.... ఈ రెంటి మధ్యా చాలా సేపు వూగిసలాడేడు

ఆఖరికి.

ఇంకా జాగ్రత్తగా వాటిని ఫెయిర్ చేసేసరికి రాత్రి మూడయింది. మొత్తం నాలుగు వ్యాసాలు. మర్నాడు వాటిని పంపించేడు.

మూడోరోజు, నాలుగోరోజు వరసగా బాక్సుకట్టి వేశారు. చాలామంది ఆశ్చర్యపడ్డారు. రఘువీర్ పండా సంగతి తెల్సిన చాలామంది సలహాలిచ్చేరు. కొంతమంది హెచ్చరికలు చేశారు. తాడోపేడో తేల్చుకోడానికి సిద్ధంగావున్న మహాపాత్రో ఏం చలించలేదు

ఐదో రోజు.

ఆ వేళ మామూలుగానే తెల్లవారింది. పూర్తిగా మంచు విడవలేదు. కానీ అప్పుడే తలుపు తట్టిన చప్పుడు. ఆ చప్పుడికి లేచి తలుపు తీశాడు. ఎదురుగా వాళ్ళు నలుగురు మనుషులు.

"బటలేసుకో ...."

"ఎందుకు ...."

"ఎందుకేంవిట్రా ఏసుకో...."

"........" మాట్లాడలేదు పాత్రో. అంతలో ఒకడు గబగబా బట్టల స్టాండు వేపు వెళ్ళి పేంటు తెచ్చి అందిచ్చేడు.

మహాపాత్రోకి వేసుకోక తప్పింది కాదు.

"రా...." లాక్కుని గబగబా రోడ్డు మీదకి తీసికెళ్ళారు.

పొలాల గట్ల వెంబడి గబగబా లాక్కుని రఘువీర్ భవనానికి తీసుకెళ్ళారు.

అక్కడ ఒకే ఒక ప్రశ్న.

"ఏంవిడిచ్చేడు నీకా సమాచారం,

PHONE: 63482. REGD.
UMA Enterprises
మా వ్యాపారాభివృద్ధి నిమిత్తం
తగ్గింపు ధర
నాణ్యమైన గ్యారంటీ నాన్
మ్యాగ్నెటిక్ స్టెయిన్‌లెస్ స్టీలు
సామానులు. అన్నిరకములు
మీరుకోరినవి ఒకేధరకు లభిస్తాయి
కిలో 1కి 60/-రూ
మాత్రమే★
5 కిలోల ఆర్డరు పంపిన వారికి
గిఫ్టు ప్రైజు మరచెంబు ఉచితం
10 కిలోల ఆర్డరు పంపిన వారికి
గిఫ్టు ప్రైజు కూజాబిందె ఉచితం
100 రకముల మా ఆర్టికల్స్ ప్రైస్-లిస్టు
ఉచితంగా పంపుతాము.
ఈ క్రింది ఎడ్రస్సుకు వ్రాయండి.
UMA ENTERPRISES
MAIN ROAD. POST BOX No: 93.
VIJAYAWADA-520001.

నన్ను రాజకీయంగా దెబ్బ తియ్యడానికి ఏ ప్రతిపక్షపోడో నీచేత రాయిస్తున్నాడివన్నీ. చెప్పు.... ఇంకెన్నున్నాయి.... మీ పత్రికదగ్గర.... అవి వెయ్యొద్దని.... టెలిగ్రాం కొట్టు.... తెల్సిందా...."

"ఏం మాట్లాడవు?...."

"అమాయకులమీద అన్యాయాలు చెయ్యడానికి. అక్రమంగా ప్రజల్ని పీడించటానికి. నీ మిల్లుల్లోకి వూర్లోని అమ్మాయిల్ని తెప్పించుకుని, బలాత్కారంగా అనుభవించడానికి.... నీకు సిగ్గూ లజ్జా.... లేకపోవచ్చు.... కాని...."

మహాపాత్రో చెంప 'చెళ్' మంది.

"వీడికిలా బుదిరాదు. వాణ్ని తీసికెళ్ళి ఆ స్తంభానికి కట్టేయండి...." రఘువీర్ పండా చెప్పినట్టుగా వాడి మనుషులు పాత్రోని స్తంభానికి కట్టేశారు. ఇష్టం వొచ్చినట్టుగా కొట్టేరు. అలా జరిగిన తర్వాత.... ఇరవైనాలుగ్గంటలు గడిచేయి.

అప్పటికి పాత్రోకి తిండిలేదు. కనీసం మంచినీళ్ళన్నా ఇవ్వలేదు.

కసిదీరా కొట్టారు.

"మరెప్పుడూ ఇలా రాయనని చెప్పు" రఘువీర్ పండా అడిగేడు. ఆ పక్కనే వాడి ముఠా వున్నారు.

"ఒరేయ్ నువ్వేదో పూడబొడిచావని అనుకుంటున్నావేమో... కాని నువ్వు పంపించిన నాలుగు వ్యాసాల్లో ఇంకా రెండు మరి రావు. అర్థమైందా....కానీ.. నీలాంటి వాణ్ణి మాత్రం బతకనివ్వకూడదు కానీ ఇది నీ మొదటి తప్పుగా వదిలేస్తున్నాం ఒక షరతుమీద.... అది నువ్వు నీ భార్యా పిల్లల్తోసహా వూరు విడిచి వెళ్ళిపోవాలి. అది రాత్రిలో జరగాలి.... అర్థమైందా. లేకపోతే నీ పెళ్ళాం, నీ బిడ్డా ఇద్దరూ వుండరు...."వాళ్ళు కొట్టిన దెబ్బలకు సగమైపోయాడు పాత్రో.

తప్పదు. వాళ్ళనించి. వాళ్ళ నరక యాతనల్నించి తప్పించుకోవాలంటే ఇక్కణ్ణించి వెళ్ళిపోక తప్పదు. తప్పదు.

అలాగేనన్నట్టు తలూపేడు

మహాపాత్రోని తీసుకొచ్చి గేటు బైట వదిలిపెట్టేరు.

గేటు దగ్గర బావురుమంటూ కూతురితో పాటు నిల్చున్న చంప.... ఆ పక్కనే నిరంజన దాదా. కన్పించారు.

* *

కానీ మహాపాత్రో సృష్టించిన ఆ రెండు న్యాసాల అలజడి మామూలు వాళ్ళ దగ్గర్నించి పెద్ద పెద్ద వాళ్ళ వరకూ వూపేసింది. ఎక్కడకు వెళ్ళినా ఒకటే.. రఘువీర్ పండా పరశురామ్‌మిశ్రా జగన్నాథ్. విశ్వజిత్ శతపథి రాక్షసత్వపు కథలే.... ఆ రకంగా రఘువీర్ వర్గం అభాసుపాలు కావడానికి కారణం పాత్రో ధైర్యమేనని చాలా మంది చాటుగా అనుకున్నారు.

కానీ—

ఎవడికీ ఎదురుగా అనే ధైర్యం లేదు. అందుకని "నువ్వలా ధైర్యం చెయ్యడం ఏం బాగాలేదు...." అని ఇంటి కొచ్చి మరీ తిట్టేరు. అవ్వేమీ పట్టించుకోలేదు పాత్రో

మహాపాత్రో వూరుకోలేదు

ఆ వ్యాసాలు పత్రికలో వెయ్యడం ఆపొద్దని. వాటి కారణంగా ఫలానా వ్యక్తులు తనని నిర్బంధించి నానా విధాలుగా చిత్రహింసలు పెట్టేరని. దానికి ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని ప్రకటన యిచ్చేడు.

అది మర్నాడు పేపర్లో వచ్చింది

* * *

"బాబూ....ఎందుకు బాబూ....వాళ్ళతో గొడవ....పిల్ల ముఖం చూడు....యిక్కడుంటే యెలాగూ వాళ్ళు బతకనియ్యరు వెళిపో....వెళిపోయి.... యెక్కడైనా హాయిగా బతుకు...." నిరంజన్ దాదా గడ్డంపట్టి బతిమిలాడేడు మహాపాత్రోని.

"వెళిపోతాను. దాదా,, వాళ్ళ అంతు చూసి వెళిపోతాను."

అదే సమయంలో, ఇంటి ముందు జీపు ఆగింది. ఆ జీపులోంచి నలుగురు పోలీసులు దిగేరు. "మా ఎస్పయిగారు మిమ్మల్ని రమ్మంటున్నారు" అని పిల్చారు.

స్టేషన్‌కి వెళ్ళగానే "ఎస్పయిని" గౌరవసూచకంగా "విష్" చేశాడు మహాపాత్రో. కానీ మహాపాత్రో వేపు ఏమాత్రం చూడలేదు ఎస్పయి ఆ ఎస్పయి చూడ్డానికే అసహ్యంగా వున్నాడు. చింతపండు బస్తాలావున్నాడు. గారపట్టిన పళ్ళు నవుల్తున్న గుడాకు.

ఒకకాలు కుర్చీమీద ఇంకోకాలు తీవిగా నేలమీద ఆనించి అడిగాడు

"రఘువీర్ పండామీద నువ్వు తిరగబడి చట్ట వ్యతిరేకంగా బెదిరించావట.... పండాగార్ని.... పరశురామ్‌ని.... బిశ్వజిత్, జగన్నాథ్‌గార్లని చంపుతానని బెదిరించావట....' దాదాపు అరుస్తూ అన్నాడు.

"అబద్ధం...."

"ఏది అబద్ధం.... వాళ్ళింటికి నువ్వెళ్ళడం అబద్ధమా.... వాళ్ళమీద తిరగబడ్డం అబద్ధమా.... అందుకు తగిన సాక్ష్యాధారాలు నాదగ్గరున్నాయి తెల్సా.."

"అంతా.... బూటకం.... నాటకం.... వాళ్ళే నన్ను" ఏదో అనబోయాడు మహాపాత్రో.

చేతిలోని లాఠీ కర్రతో విసురుగా దబదబా. దబ. దబా బాదేడు ఎస్పయి.

"ఒరేయ్.... లంజాకొడకా.... వాళ్ళమీద తిరగబడ్డానికి.... నీకెన్ని గుండెల్రా కుక్కా లంజాకొడకా...."

"మీరిలా ప్రవర్తించడం....' పాత్రో లాఠీ కర్రని అడ్డేడు

"ఏం చేస్తావ్రా.... నువ్వు కాదు....నీ అమ్మ మొగుడు నన్నేం చెయ్యలేడు.... తెల్సా నా ఇష్టం. నా ఇష్టం రా ఎవడేంటి చేస్తాడో.... నిన్నీ క్షణంలో ఎవడాదుకుంటాడో చూస్తాను. నిన్ను చంపేస్తాను.... ఎవడడ్డం వస్తాడు? నీ గురించి ఎవడిక్కావాల్రా లంజాకొడకా...."

"నేను తల్చుకుంటే నీకిప్పుడే బేడీలేసి లాకప్పులో పడేసి చిత్రహింసలు పెట్టగల్ను. నాకా పవర్సున్నాయి.... నీలాంటి తిరుగుబాటుదారుల్ని అణచటానికి నాకా పవర్సిచ్చిందిరా ప్రభుత్వం.... తెల్సా. కానీ ఇలాంటి వెధవ్వేషాలు ఎయ్యకుండా నీకిది వార్నింగు మాత్రమే. తెలుసుకో. నేను మంచోణ్ణి.... లేకపోతే.... నీ ఈ తప్పుకి బట్టలిప్పించి, ఈ వూర్లోనేకాదు భువనేశ్వర్ మైన్‌రోడ్‌లో నడిపించీగల్ను తెల్సా... వార్నింగుతో... వుత్తి వార్నింగుతో వదిలేస్తున్నాను.... తెలుసుకో.... వెళ్ళు..."

ఆ రాత్రి—

సమయం పదయి వుంటుంది. మధ్యాహ్నంనుంచి చంప ఏడుస్తూనేవుంది

"ఎక్కడికైనా వెళ్ళిపోదావండీ..."

మహాపాత్రోకి అక్కడే వుండాలని వుంది.

కానీ....కానీ

"అలాగే వెళ్ళిపోదాం...." అన్నాడు

ఆఖరుకి చంప బట్టలు సర్దింది సామాన్లూ అవీ నిరంజన్ దాదాకి అప్పజెప్పారు

సన్నగా మంచు కురుస్తోంది. వుండుండి వీచేగాలికి కొబ్బరిచెట్లు అప్పుడప్పుడు చప్పుడు చేస్తున్నాయి. ఋషి పక్షుల శబ్దం చితల చప్పుడులా వినబడుతోంది. దూరంగా పారుతూ వెళిపోతున్న ఋషికుల్ నదీ తరంగాల మీద పడుతున్న వెన్నెలకాంతి శవంమీద కప్పిన తెల్ల గుడ్డలా వుంది. సగం చీకటి. సగం వెల్తురు. ఇసక దిబ్బలమధ్య దారి అగుపించడంలేదు.

జగన్నాథ్ గుడి దాటాక రాళ్ళ దారి. అది దాటాక ఇసకబాట. అక్కడ చిన్న నది పాయ. ఆ పాయ దాటాక చిన్న కొండలు.... ఆ కొండలు దాటాక పెద్ద

తోట.... ఆ తోట దాటితే రెండు మైళ్ళు పొలాలు.

ఆ రాత్రి ఎటు ప్రయాణం?

ఎక్కడికి వెళ్ళాలి?

ఏదో బస్సు దొరక్కపోదు.

కొండల మధ్య నుంచి నడుచుకుంటూ దరిదాపు తోట వరకూ వచ్చేరు పాత్రో, చంప

"ఒరేయ్." పిలుపు: ఆ పిలుపు తనకి తెల్సు ఆ గొంతు కూడా తనకి తెల్సు. ఆ గొంతు వినగానే "పరుగెత్తు" అన్నాడు పెళ్ళాన్ని.

మహాపాత్రో, చంప ఇద్దరూ పరుగెత్తుతున్నారు. ఇసకలో కాళ్ళు కూరుకుపోతున్నాయి. వెనక వాళ్ళు ఎడుగురు.. ఒకడి చేతిలో టార్చిలైటు ఆ వెలుగు దగ్గరకు వస్తుంటే పాత్రో గుండెలు భయంతో అదిరిపోతున్నాయి

ఆయాసం. పరుగు.

ఎక్కడైనా దాగుందామంటే వాళ్ళు దగ్గర పడ్డారు.

"పరుగెత్తు.... చంప" కేకలేశాడు. శక్తినంతా కూడదీసుకుని ముందుకురికేడు. చేతిలో పెట్టె జారిపోయింది. జోళ్ళు ఎప్పుడో కిందపడిపోయాయి. కళ్ళద్దాలు వుండుండి సరుకుంటున్నాడు. చంప పరుగెత్తలేకపోతోంది ఆఖరుకి చంప చెయ్యిని వదిలేశాడు.... ముందుకి.... పొలాల గట్టు మీద పడ్డాడు.... ముందుకి.... ముందుకి.... ఇంకా ముందుకి.... మహాపాత్రో వెళిపోయాడు.

"ఏవండీ....

ఏవండీ....

ఏవండీ....

ఏవండీ...."

ఆ కేకలు వినబడనంత దూరం వెళిపోయాడు మహాపాత్రో. భయంతో భార్యనుకూడా ఆదుకోలేనంత దూరం వెళిపోయాడు మహాపాత్రో—

చీర మడతలుపడి కాళ్ళక్రింద పడిపోయింది. చేతిలో కన్నపిల్ల కళ్యాణి యిసకలో పడిపోయింది "....కళ్యాణీ.... కళ్యాణీ కళ్యాణీ ఎక్కడ. .ఎక్కడ.." అటూ యిటూ చూసూ....వెనక్కి చూస్తూ వెతుకుతోంది

నాలుగడుగులు వెనకాతల బోర్లాపడిపోయి కదలకుండా బొమ్మలా కళ్యాణి. గబుక్కున రెండు చేతుల్లోకి పిల్లని తీసుకుని గాలిలా ముందుకు దూసుకుని పరుగెత్తింది చంప.

ఒక్కసారి వెనక్కి చూసింది.

వాళ్ళు కనపడలేదు. అక్కడున్న చెట్టు వెనక్కి నక్కి కూతురి నుదుటమీద, బుగ్గల మీద, చేతులమీద చెయ్యేసి చూసింది.

ఒక్కసారి చంప హృదయం ఆగిపోయింది.

కళ్యాణి వళ్ళు చల్లగా వుంది. ముక్కుమీద వేలేసి చూసింది. వూపిరి ఆడటం లేదు.

చంప గుండె ఆయాసంతో కొట్టుకోవడం స్పష్టంగా విన్పిస్తోంది. ఆ సమయంలో చంప కళ్ళల్లో నీళ్ళున్నాయో లేవో తెలీదు.

"కళ్యాణీ...." ఏడుస్తూ అరిచిందో, అరుస్తూ ఏడిచిందో తెలీదు. పిచ్చిగా కాళ్ళూ చేతులు, బుగ్గలు, నుదురు పట్టుకుని చూస్తోంది. అప్పటికీ సంశయం తీరలేదు.

"ఏవండీ...." ఆ పిలుపు ఆ సరుగుడు రాటలకే అంటుకుపోయింది. గబుక్కున లేచి పిల్లని రెండు చేతులతో పట్టుకుని పరుగెత్తబోయింది. ఇసకలో అడుగులు పడటంలేదు కాళ్ళు కూరుకుపోయాయి. కింద పడిపోయింది.

చేతిలోని పిల్ల తుళ్ళిపోయి ఇసక దిబ్బమీద పడిపోయింది బొమ్మలా.

"పట్టుకో.... పట్టుకో...."

"ఏవే....లంజా." నలుగురూ నాలుగు వేపుల్నుంచి పట్టుకున్నారు "వదర్లా.. వదలండిరా...." గింజుకుంటోంది. వాళ్ళు వదల్లేదు వాళ్ళ రాక్షసపు చేతుల్లోకి చిక్కిపోయింది.

వాళ్ళు ఏడుగురు.

ఒకడు చీర ఫర్ ఫర్మని చింపినట్టుగా లాగేశాడు ఇంకొకడు జాకెట్టు మీద పళ్ళు అదిమిపట్టి కొరికాడు. ఆ పంటిగాట్లు జాకెట్టుని దాటి భుజమ్మీద ముళ్ళులా గుచ్చుకున్నాయి. ఇంకొకడు లంగాని లాగేశాడు. వున్న శక్తినంతా కూడలాక్కుని ఒకసారి లేచి ఎగిరి, చంప ముందు కురికింది.

గబగబా ...గబగబా ....గబగబా.

గొంతు పూడిపోయి కిందపడిపోయినట్టుగా కేకవేసింది పరుగెడుతోంది. పరుగెడుతోంది. ఆమె వెనకాతలవాళ్ళు.... వున్న శక్తినంత కూడదీసుకుని ఆమె

ఒక్కసారి యెక్కణ్ణుంచో వీచిన గాలికి సరుగుడు రువ్వలు కదిలాయి. ఆ రువ్వల శబ్దం వికృతంగా, భయంకరంగా వుంది. ఆ యిసక దిబ్బలు స్మశానంలో సమాధుల్లాగా వున్నాయి.

చంప అలిసిపోయింది ఆ చీకట్లో ఆ మంచురాత్రి. చలిరాత్రి. దూరంగా ఋషికుల్ కెరటాలమీంచి వచ్చేగాలి చిన్నపిల్ల ఏడుపులాగా వుంది.

ఏడుగురు చంపని పట్టేశారు.

ఇంతల్లో ఒకడు బరబరా చెట్ల మధ్యకు లాక్కొచ్చాడు. ఇంకొకడు టార్చిలైటుతో ఆ అమ్మాయి ముఖమ్మీద లైటు వేసి చూశాడు. చచ్చిపోయిందా. బతికిందా? చచ్చిపోయిందా?

చచ్చిపోవడానికి ఆ అమ్మాయి పిరికిది కాదు

కానీ ఎదిరించడానికి మాత్రం ఆ అమ్మాయి ఒంటరిది. ఒంట్లో శక్తి లేదు గుండెల్లో బలంలేదు. భర్త ఆ చుట్టుపక్కల ఎక్కడా లేడు పిల్ల ఈ లోకంలో లేదు. ఆమెకి బ్రతుకుమీద ఆశ లేదు. వాళ్ళకి మానవత్వం లేదు. ఆ రాత్రికి దయలేదు.... ఆ చీకటికి చూపులేదు.... ఆ ప్రకృతికి పుట్టుకే లేదు.

ఒకరు.... ఒకరు....

ఒకరు తర్వాత ఇంకొకరు.

ఒకరితర్వాత ఒకరు.

వరసగా ఏడుగురు....

ఏడుగురు .... వరసగా....

ప్రకృతంతా మామూలుగానే వుంది.

నది నిశ్చలంగానే ప్రవహిస్తోంది.

మంచు ముద్దలాగా కురుస్తూనే వుంది. ఆ అర్ధరాత్రి ఓ తల్లి తను చావు బతుకుల్లో వున్నతల్లి. వళ్ళంతా రక్తంతో ఇసక దిబ్బలమీద నగ్నంగా....

కన్నకూతుర్ని వెతుక్కుని, చూసుకుని ఆ చచ్చిన శవాన్ని ముద్దాడి.... ఆ ఇసక దిబ్బమీదే, రెండడుగుల నేలలో.... చేతి వేళ్ళతో గొయ్యితీసి.... ఏడుస్తూ పాతిపెట్టి పిచ్చిగా.... పిచ్చిగా.... అరిచింది.

ఆ పిచ్చితల్లి ఈ దిక్కుమాలిన దేశంలో ఓ ఆడది.

* * *

మహాపాత్రో చేతి వేళ్ళు గట్టిగా బుర్రలోకి దోపి జుత్తు పీక్కున్నాడు. ఇనుప చువ్వలకేసి బుర్రని గట్టిగా అదిమి గడ్డాన్ని పీక్కుని శక్తినంతా కూడదీసి—

"లం....కొడుకులు...." అరచి గట్టిగా బుర్రను ఇనుప చువ్వలకేసి బాదుకోవడం ప్రారంభించాడు. ఒకటి.... రెండు.... మూడు .... నాలుగు .... ఐదు .... ఆరు.... ఏడు .... ఎనిమిది .... రక్తపు చుక్కలు.

మహాపాత్రో అరుస్తున్నాడు

"నేను పిచ్చెక్కి నా పెళ్ళాన్ని, నా కూతుర్ని చంపుకున్నానట్రా .... నేను ద్రోహినట్రా ....నేను నేరస్తుణ్ణా.... నేను నేరస్తుణ్ణా....ఒరేయ్ ....ఒరేయ్ ...."

అతని శరీరంలోంచి కిందపడ్డ రక్తపు చుక్కల్లో అతని ప్రతిబింబం కన్పించింది.